క్లుప్తంగా

దుస్తుల పంపిణీ

చుంచుపల్లి: విద్యానగర్ కాలనీ పంచాయతీ 25 మంది పారిశుద్ధ్య కార్మికులకు జీవీ మాల్ సహకారంతో గురువారం తహసీల్దార్ కృష్ణ చేతుల మీదుగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రోజంతా ప్రజల క్షేమమే తమ క్షేమంగా భావిస్తూ పరిశుభ్రం కార్మికుల సేవలు వెలకట్టలేమన్నారు. ఈ కార్యక్రమంలో జీవీ మాల్ మేనేజర్ యూసఫ్, పీఆర్‌ఓ రాజు, సెక్రెటరీ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి..

ఇల్లెందు: ఉద్యోగ విరమణ చేసిన సింగరేణి కార్మికులకు సంస్థ నుంచి చెల్లించాల్సిన గ్రాట్యూటీ బకాయిలు తక్షణమే చెల్లించాలని మాజీ ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం జీఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ 2017 జనవరి నుంచి సింగరేణిలో ఉన్న అధికారులకు రూ.20 లక్షలు గ్రాట్యూటీ ఇవ్వటం జరిగిందని, కానీ కార్మికులకు మాత్రం చెల్లించటం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పేరయ్య, మల్లెల వెంకటేశ్వర్లు, రాజేశ్వరరావు, ఇమామ్ ఉన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించండి..

టేకులపల్లి: అమలు కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పిలుపునిచ్చారు. గురువారం బోడు గ్రామపంచాయతీ రామచంద్రునిపేట, కొప్పురాయి గ్రామాలలో పర్యటించారు. మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. బొమ్మెర వరప్రసాద్, బానోతు హరిసింగ్, రామానాయక్ పాల్గొన్నారు.

వసతులు కల్పించండి..

పాల్వంచ: మున్సిపాలిటీ డివిజన్‌లోని అన్ని వార్డుల్లో అధికారులు మౌలిక వసతులు కల్పించాలని సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని గట్టాయిగూడెంలో కొత్వాల పర్యటించారు. అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీలు, రోడ్లు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కొత్వాల మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం చేయరాదని, మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు తీసుకోవాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవి ప్రసాద్‌ను కోరారు.

నలభై ఏళ్ల జ్ఞాపకాలు పదిలం..


1985-86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

ఇల్లెందురూరల్: 21పిట్ ఏరియా ఉన్నత పాఠశాల 1985–86లో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల మొత్తం కలియ తిరిగి తరగతి గదులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. సహపంక్తి భోజనం చేశారు.

గుణపాఠం చెబుతాం..

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా గురువారం సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట ఏఐటీయూసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ వ్యక్తిగతంగా దూషించడం మంచిదికాదని, భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. అకారణంగా విమర్శిస్తే తగిన గుణపాఠం చెపుతామన్నారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజన్, ఆల్బర్ట్, రజాక్, పీతాంబరరావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

జోనల్ క్రీడలు ప్రారంభం

చుంచుపల్లి: రుద్రంపూర్ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ కొత్తగూడెం జోనల్ స్థాయి పాఠశాల క్రీడలను చుంచుపల్లి మండల విద్యాశాఖ అధికారి బి.బాలాజీ గురువారం ప్రారంభించారు. మొదటి రోజు జరిగిన 17 సంవత్సరాల లోపు బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కొత్తగూడెం టూ టౌన్ సీఐ ప్రతాప్, పెనగడప పాఠశాల హెచ్‌ఎం రాములు, సెంట్ జోసఫ్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి నరేష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమానికి సిద్ధం కండి..

టేకులపల్లి: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని జరుగుతున్న కుట్రను తిప్పికొట్టేందుకు లంబాడీలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాలోతు శివ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం టేకులపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎస్టీలుగా చేర్చబడిన లంబాడీల హక్కుల సాధనకు, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన కోసం ఈనెల 25న జిల్లా కేంద్రంలో జరగనున్న జిల్లా సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

వీడియోల ద్వారా రక్షణ సూత్రాలు!

- గతంలో గనుల్లో సభల ద్వారా అవగాహన
- ప్రస్తుతం ఆడియో, వీడియోల ద్వారా ప్రచారం
- తొలిసారి కొత్తగూడెం ఏరియాలో ప్రయోగం


అండర్ గ్రౌండ్‌లో టెలీఫిల్మ్ చిత్రీకరిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉద్యోగమంటే కుటుంబాలలో తెలియని భయం. డ్యూటీకి వెళ్లిన వాళ్లు తిరిగి వచ్చేంత వరకు నమ్మకం లేని పరిస్థితి. కానీ నేడు ఆ భయం చాలా వరకు పోయింది. గనుల్లో కార్మికుల రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడమే ఇందుకు కారణం. అంతేకాక మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఎంవీటీసీ)ను ఏర్పాటు చేసి, ఉద్యోగంలో చేరే బదిలీ వర్కర్ నుంచి ఉద్యోగ విరమణ పొందనున్న సూపర్‌వైజర్ వరకు పలురకాల శిక్షణ ఇస్తూ రక్షణ సూత్రాలపై అవగాహన కల్పిస్తున్నారు.

గతంతో పోలిస్తే భిన్నంగా...

సింగరేణి సంస్థ ఎంవీటీసీల ద్వారా శిక్షణ ఇచ్చి గనుల్లో కార్మికులకు పనులు కేటాయిస్తుంది. అయితే, పని ప్రదేశంలో తెలిసో తెలియక.. నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగి అంగవైకల్యంతోపాటు, కొన్ని సందర్భాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రమాదాల నివారణకు గతంలో ప్రాక్టికల్, థియరీ ద్వారా రక్షణ సూత్రాలను వివరించేవారు. అయినా ప్రమాదాలు పూర్తిగా తగ్గలేదు. దీంతో సింగరేణిని ప్రమాదరహితంగా మార్చేందుకు టెలీఫిల్మ్ (ఆడియో, వీడియో, విజువల్, స్క్రోలింగ్)లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

కార్మికుల ప్రాణాలు కాపాడేందుకే...

ఉత్పత్తి, ఉత్పాదకతలో అగ్రస్థానం నిలుస్తున్న సింగరేణి కార్మికుల రక్షణకు రూ.కోట్లలో నిధులు కేటాయిస్తుంది. ఈ నేపథ్యాన ప్రమాదాలు పూర్తిగా నేషనల్ సేఫ్టీ కాన్ఫరెన్స్ రెగ్యులేటరీ యాక్ట్ ప్రకారం చర్యలు చేపట్టారు.

ఈ మేరకు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయి, వాటిని ఎలా నివారించాలనే అంశాలపై టెలీఫిల్మ్‌లు రూపొందించి వీటి ద్వారా కార్మికులకు అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా కార్మికులకు సులువుగా అర్థమై ప్రమాదాల సంఖ్య సున్నాకు చేరుతుందనే నమ్మకంతో ఉన్నారు.

11మంది ఎంపిక...



సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఎస్‌ఎంపీ)పై ఆడియో, వీడియో ద్వారా కాకుండా స్క్రోలింగ్ ద్వారా కూడా వివరించేందుకు 11మందిని ఎంపిక చేశాం. వీరికి శిక్షణ ఇచ్చి అమలు చేస్తున్నాం. ఇది విజయవంతమైతే కంపెనీ వ్యాప్తంగా అమలు చేయాలనే ప్రణాళిక ఉంది.

– జి.లక్ష్మణ్, ఎంవీటీసీ మేనేజర్

తొలిప్రయత్నం కొత్తగూడెంలోనే...



కొత్తగూడెం ఏరియా ఉత్పత్తిలో అగ్రభాగాన నిలుస్తోంది. ఇందుకు కారణమైన కార్మికులు ఆరోగ్యంగా ఉండాలనే భావనతో రక్షణ సూత్రాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇందుకోసం తొలిసారి కొత్తగూడెం ఏరియాలో టెలీఫిల్మ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– శాలేం రాజు, ఏరియా జీఎం

ప్రమాదాల నివారణకు చర్యలు...



ఇటీవల గనుల్లో 80 శాతం ప్రమాదాలు తగ్గాయి. మిగతావి కూడా జరగకుండా కార్యక్రమాలు చేపడుతున్నాం. గనుల్లోనే కాక కార్మికులు బయట కూడా ప్రమాదాల బారిన పడొద్దని అవగాహన కల్పిస్తున్నాం. ఇదంతా దశల వారీగా నిరంతరం జరుగుతుంది.

– చింతల శ్రీనివాస్, జీఎం సేఫ్టీ

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: అంగన్‌వాడీ పాఠశాలలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారి లెనినా, ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌష్టికాహారంపై అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు మూడు రోజులు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఈ సమయంలో శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు పౌష్టికాహారం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతీ చిన్నారి క్రమం తప్పకుండా అంగన్‌వాడీ పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకుంటూ ఆటపాటలతో విద్యాబోధన చేసి ఆకట్టుకోవాలని సూచించారు. సీడీపీఓ అరుణకుమారి, ఏసీడీపీఓ విజయకుమారి, సూపర్‌వైజర్లు సక్కుబాయి, కొమరమ్మ, జయ పాల్గొన్నారు.

సింగరేణి లాభాలు ప్రకటించాలి

ఇల్లెందు: సింగరేణి లాభాలు ప్రకటించి 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఇల్లెందు ఏరియా బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందులో ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. రెండు దఫాలు సీఎండీతో డైరెక్టర్లతో జరిగిన సమావేశంలో అంగీకరించిన డిమాండ్లను అమలు చేసేందుకు కాలయాపన చేయటం తగదన్నారు. సొంత ఇంటి పథకం కోసం ఏర్పాటు చేసిన సమావేశం ఇంత వరకు జరుగకపోవటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఏఐటీయూసీ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నేతలు రాజారామ్, గడదాసు నాగేశ్వరరావు, కొరిమి సుందర్, నాదేండ్ల శ్రీనివాసరెడ్డి, దాట్ల వెంకటేశ్వర్లు, బాలాజీ, జయరాజ్, గుగులోతు కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీతాల్లో కోతలు అన్యాయం

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలోని మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), జూనియర్ లెక్చరర్ల (జేఎల్) వేతనాలను గతంలో మాదిరిగానే కొనసాగించాలని మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ.యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించకుండా తాజాగా వేతనాలు విడుదల చేసిన ప్రభుత్వం, భారీ కోతలు విధించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

ప్రతిభా పరీక్ష

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ఇల్లెందు ఏరియా వారి ఆధ్వర్యంలో జేకే ఓసీ విస్తరణ ప్రభావిత ప్రాంతాల, పట్టణ నిరుద్యోగ మహిళలకు వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ అందించింది. ఈ మేరకు వారికి ఈ నెల 19న ప్రావీణ్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య తెలిపారు. గురువారం మాట్లాడుతూ జేకే సింగరేణి పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోర్సులు నేర్చుకున్న మహిళలు సకాలంలో రాత పరీక్షకు హాజరు కావాలని కోరారు.

అవగాహన

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం రామవరంలోని ఏకలవ్య పాఠశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్, శాస్త్రవేత్తలు ఎం.శరత్, బి.శివ, పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్


పాఠశాలలో శుభ్రం చేస్తున్న నాయకులు


చుంచుపల్లి: నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా పక్షం రోజులు సేవా కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత కొత్తగూడెం ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో దారా రమేష్, ఎమనూరు శివకృష్ణ, శీలం విద్యాసాగర్, సలీం, పైడిపాటి రవీందర్, వేణు, చంద్రగిరి రాము, భవాని ప్రసాద్, జ్యోతి, ప్రమోద్, గుణ, రాజమౌగిలి, చారి, మాదాసి పద్మ, పూర్ణ పాల్గొన్నారు.

టేకులపల్లి: ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు బీజేపీ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం టేకులపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. నాయకులు ఆలయ ఆవరణాన్ని శుభ్రం చేశారు. తేజావత్ శంభునాయక్, వాంకుడోత్ హర్తీరామ్, ధరావత్ డ్రావ్‌సింగ్, బాదావత్ సురేష్, జామాలాల్, బోడ నవీన్, రవి, రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

కొత్తగూడెంఅర్బన్: ఎస్‌అండ్‌పీసీ సెక్యూరిటీ సిబ్బంది 51వ ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ తరగతులు కొత్తగూడెం ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం (సెక్యూరిటీ) జె.వేణుమాధవ్ మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బందికి క్రమశిక్షణ ప్రధానమని, ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ వలన డ్యూటీ జీవితంలోనే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఎంతో మేలు జేస్తుందన్నారు. ఈ శిక్షణలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టాలు, మాండేటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్, ట్రాఫిక్ పాయింట్, మస్ డ్యూటీస్, క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అవగాహన కల్పించబడిందని తెలిపారు. ఉత్తమ ట్రైనీలుగా ఎంపికైన అబ్దుల్ ఉబయ్దుల్లాహ్, డి.ప్రకాష్‌లకు బహుమతులు అందజేశారు.

విజయవాడ వెళ్లిన జేబీపీ శ్రేణులు


విజయవాడకు బయలుదేరున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలని ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీపీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే మహాధర్నాను కొత్తగూడెం నుంచి జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ ఆధ్వర్యంలో భారీ వాహన శ్రేణితో విజయవాడకు వెళ్లారు. కామేష్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దశలవారీగా రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే ఆ జీఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, వినయ్, నాగుల రవికుమార్, మిట్ట నరసింహారావు, పోలే కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీఎల్‌ఎం మేళా


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు

టేకులపల్లి: విద్యార్థుల సృజనాత్మకత మెరుగుదలకు, పాఠ్యాంశాలు సులువుగా అర్థం చేసుకునేందుకు టీఎల్‌ఎం మేళా ఎంతగానో ఉపయోగపడుతుందని మండల విద్యాశాఖ అధికారి అజ్మీర జగన్ నాయక్ తెలిపారు. గురువారం టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను ఆయన ప్రారంభించారు. మండలంలోని మొత్తం 86 స్కూళ్ల నుంచి వివిధ రకాల బోధనోపకరణాలను ప్రదర్శించారు. వాటికి బహుమతులు ప్రకటించారు. విజేత పాఠశాలలు జిల్లా స్థాయిలో జరగనున్న టీఎల్‌ఎం మేళాకు హాజరవుతారని ఎంఈఓ చెప్పారు. అనంతరం మండలంలోని 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మోహన్‌రావు, దేవదాసు, మంగీలాల్, జోగా రవి, రాంచందర్ సింగ్, తారాసింగ్, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లను పరిష్కరించండి..

ఇల్లెందురూరల్: ఆశ్రమ, హాస్టల్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. రొంపేడు గ్రామంలో వర్కర్ల సమ్మెకు గురువారం ఆయన సంఘీభావం ప్రకటించారు. మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా కాంట్రాక్టు, డైలీ వేజ్ పద్ధతిలో పనిచేస్తున్న వర్కర్లు తమ విధులను పర్మనెంట్ చేయాలని కోరుతూ ఆందోళనలు చేస్తున్నారని గుర్తుచేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచడంతోపాటు బకాయి వేతనాలను కూడా వెంటనే చెల్లించాలని కార్మికులు కోరడం న్యాయమైనవేనని పేర్కొన్నారు. మోకాళ్ల రమేష్, రావూరి ఉపేందర్, నోముల భానుచందర్, మోతీలాల్ పాల్గొన్నారు.

వినోభానగర్‌లో నాకా బందీ


వాహన పత్రాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

ఇల్లెందు: పట్టణంలోని వినోభానగర్‌లో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. గురువారం ఇల్లెందు సీఐ టి.సురేష్ ఆధ్వర్యంలో 200 మంది పోలీసులతో తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. వినోభానగర్, హరిజన బస్తీలో 73 వాహనాలను పట్టుకున్నారు. నిబంధనలు పాటించని వారిని గుర్తించి జరిమానా విధించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. డీఎస్పీ ఎన్.చంద్రభాను కొత్త చట్టాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రానున్న దసరా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. రాత్రి సమయాల్లో అనవసరంగా తిరగరాదని, ఈవిటీజింగ్, మహిళలను వేధించటం లాంటివి నిర్వహించకూడదన్నారు. ఇల్లెందు సీఐ టి.సురేష్, టేకులపల్లి సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు రాజేందర్, హసీనా, సూర్యం, ఏఎస్ఐలు హెడ్‌కానిస్టేబుల్, రిజర్వ్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం..

టేకులపల్లి: జిల్లాలో రైతులు యూరియా కొరతతో అవస్థలు పడుతున్నారని నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయిందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు తుపాకుల నాగేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు గురువారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మొక్కజొన్న, పత్తి, వరి తదితర పంటలు వేసిన రైతులు వాటికి నత్రజని అందించలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. సరిపడా యూరియా అందించకపోగా రోజుల తరబడి తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో యూరియా కొరతను నివారించకపోతే సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు ఎట్టి నరసింహారావు, న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఇఫ్టూ నాయకులు దుబాకుల ప్రసాద్, భూక్యా హర్ష్య, నర్సింగ్, కీర్యా, కొడెం రవి, మల్లెల పొట్టయ్య పూనెం సమ్మయ్య, బి.రమేష్, పూనెం రుక్కమ్మ, రాంచందర్, ఈసం సూరయ్య, కొరం జగపతి పాల్గొన్నారు.

రెస్క్యూ టీమ్‌కు జీఎం అభినందన


అభినందిస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 10,11 తేదీలలో రామగుండం–2 ఏరియాలో జరిగిన జోనల్ మైన్స్ – 2025 రెస్క్యూ కాంపిటేషన్‌లో సింగరేణి వ్యాప్తంగా టీమ్‌లు పాల్గొన్నాయి. వీటిలో కొత్తగూడెం రీజియన్ రెస్క్యూ టీమ్ బెస్ట్ ఫస్ట్ ఎయిడ్ ఈవెంట్ బహుమతి సాధించింది. ఈ టీమ్‌లో కొత్తగూడెం ఏరియా నుంచి మౌనిక, కృష్ణవేణి, చందన జావేరి, గాయత్రి పాల్గొని సత్తా చాటారు. మౌనిక టీమ్ ఓవరాల్‌లో ప్రథమ స్థానం, బెస్ట్ కెప్టెన్‌గా కృష్ణవేణి సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు ఆయన చాంబర్‌లో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, రామకృష్ణ (ఏజీఎం సివిల్), డీజీఎం పర్సనల్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

25న 'చలో హైదరాబాద్'

ఇల్లెందురూరల్: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 25న అంగన్‌వాడీ ఉపాధ్యాయుల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు మరియ, వెంకటమ్మ, నేతలు అరుణ, దేవేంద్ర కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ శిబిరంలో ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని అంగన్‌వాడీ పాఠశాలల ద్వారానే కొనసాగించాలని, అన్ని యాప్‌లను ఒకే పరిధిలోకి తేవాలని, 5జీ ఫోన్లు పంపిణీ చేయాలని వేతనం రూ.18వేలు చెల్లించాలని తదితర డిమాండ్లతో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం

- ఇల్లెందులోని ఆంబజార్, మెయిన్‌రోడ్లలో రద్దీ
- సిగ్నళ్లు లేక ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు
- పోలీసుల పర్యవేక్షణ కూడా అంతంతే..


ట్రాఫిక్ సిగ్నళ్లు లేని గోవింద్ సెంటర్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఎక్కడా కనిపించవు. పార్కింగ్ ప్రదేశాల ఊసే లేదు. ఇష్టారాజ్యంగా వాహనాలను నిలుపుతుండటంతో పట్టణం నుంచి బయటకు వెళ్లేందుకు గంటల సమయం పడుతోంది. ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారు. బస్టాండ్ లోపలికి, బయటకు వెళ్లే మార్గాలకు అవుట్, ఇన్ తెలిపే బోర్డులు కూడా లేవు. ఈ రహదారులను ప్రైవేట్ వాహనాలు కమ్మేసి బస్సుల రాకపోకలకు అంతరాయం కల్పిస్తున్నాయి. ఇక పట్టణంలోని ప్రధాన రహదారి వెంట వెళ్తున్న వాహనాలు రోడ్డు మీదనే ఎక్కడ పడితే అక్కడే నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పోలీస్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఆర్టీఏ, ఇతర శాఖలతో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేయాల్సిన 'ట్రాఫిక్ సలహా సంఘాలు' ఊసే లేకుండా పోయింది. మెయిన్‌రోడ్, ఆంబజార్‌లో మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు మీద మార్జిన్ తెలిపే సిగ్నల్ లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో రోడ్డు మధ్యలోనే వాహనాలను నిలుపుతుండటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏ వాహనం ఏటు వెళ్లాలనే సిగ్నల్ చూపే బోర్డులు కూడా పట్టణంలో ఎక్కడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఇష్టారాజ్యంగా వాహనదారులు తమ వాహనాలను రోడ్డు మళ్లించుకుపోతుండటంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక అతివేగాన్ని అదుపు చేసేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకుండానే వదిలేశారు. వ్యాపారులు రోడ్లను ఆక్రమించుకోని డ్రెయినేజీపై వ్యాపారాలు చేస్తుండటం వల్ల వాహనదారులు షాపుల ముందు రోడ్డు వెంట వాహనాలను నిలుపుతుండడంతో రోడ్లన్నీ వాహనాలతో మూసుకుపోతున్నాయి.

నియంత్రణ చర్యలు శూన్యం...

ఇల్లెందు పట్టణంలో 50 వేల జనాభా ఉంది. ఇల్లెందు – ఖమ్మం, ఇల్లెందు – కొత్తగూడెం, ఇల్లెందు – పాఖాల, ఇల్లెందు – గుండాల, ఇల్లెందు – కారేపల్లి, ఇల్లెందు – సత్యనారాయణపురంలకు వెళ్లే మార్గాలు ఉన్నాయి. పట్టణంలోని గోవింద్ సెంటర్, జగదాంబా సెంటర్, ప్రభుత్వం వైద్యశాల, కరెంటాఫీఎస్, జేకే బస్టాఫ్, ఆంబజార్‌లలో ప్రధాన కూడళ్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది.

నిఘా నేత్రాలే దిక్కు.. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం వల్ల ఇక నిఘా నేత్రాలే దిక్కు అన్నట్లు మారింది. ట్రాఫిక్, చోరీల నియంత్రణకు పోలీసులు వ్యూహాత్మకంగా అడ్డుకట్ట వేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పట్టణంలో అన్ని ప్రధాన రహదారులు, కూడళ్లు, పట్టణం నుంచి బయటకు వెళ్లే మార్గాలను కవర్ చేస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రూ.లక్షల వ్యయంతో 100 వరకు హైఫ్రీక్వెన్సీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్‌ను నియంత్రించాలి..



పట్టణంలో ప్రధాన రహదారితో పాటు ఆంబజార్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. బస్టాండ్‌లో అవుట్ ఇన్ బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రధాన ద్వారాల వద్ద ఆటోలు, టాటా మ్యాజిక్‌లు నిలపకుండా చర్యలు తీసుకోవాలి.

– గంగాధరణి రవి, ఇల్లెందు

అధికారులు చర్యలు తీసుకోవాలి..



మెయిన్‌రోడ్, ఆంబజార్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించాలి. కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్య రాకుండా పోలీస్‌ను నియమించాలి. ప్రధానంగా కూడళ్ల వద్ద పోలీస్ సిగ్నల్స్ గదులు ఏర్పాటు చేశారు. కానీ పోలీసులు లేరు. ఉంటే వాహనదారులకు భయం ఉంటుంది.

– మునిగంటి శివ, ఇల్లెందు